క్లుప్తంగా

ఊడిన 108 అంబులెన్స్ వాహన చక్రం

అమలాపురం టౌన్: ఆపద సమయంలో రోగులు, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించే 108 అంబులెన్స్ వాహన ముందు చక్రం ఊడిపోయిన ఘటన అమలాపురం గడియార స్తంభం సెంటరులో మంగళవారం చోటుచేసుకుంది. ఆ సమయంలో అంబులెన్స్‌లో రోగులెవరైనా ఉన్నారేమోనని స్థానికులు ఆందోళన చెందారు. రోగిని ఆసుపత్రిలో దింపేసి వస్తున్న సమయంలో ప్రమాదం జరిగిందని తెలిసి అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటన కారణంగా అమలాపురం గడియారం స్తంభం సెంటరులో మంగళవారం మధ్యాహ్నం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయమేర్పడింది. పట్టణ పోలీసులు జేసీబీని రప్పించి తాళ్ల సహాయంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కకు తరలించి సమస్యను పరిష్కరించారు.

అభయాంజనేయ స్వామికి పూజలు



అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తమలపాకుల దండలు, వడల దండలు సమర్పించి స్వామికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ఘనంగా పోలేరమ్మ తీర్థం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

అమలాపురం రూరల్: సమనస గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమట శ్యామ్‌కుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

యానాం: యానాం బైపాస్ సెంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడని ఎస్‌ఐ శేరు నూకరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బైపాస్ రహదారి పరిధిలోని న్యూగోపీకృష్ణా బార్ సమీపంలో సుమారు 55 సంవత్సరాల వ్యక్తి మృతదేహం కనిపించిందన్నారు. వడగాల్పులకు గురై లేదా అనారోగ్యంతో అతడు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని యానాం మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు యానాం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పైపులైన్‌లు నిర్మిస్తాం

అంబాజీపేట: రోడ్డు నిర్మాణ పనుల్లో పాడైన మంచినీటి పైపులైన్‌లను తొలగించి వాటి స్థానే నూతన పైపులైన్‌లను నిర్మించి తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎఎస్‌వీ పద్మనాభం అన్నారు. వాకలగరువులో తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని అలాగే పైపులైన్‌లు వేయాలని కోరుతూ ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు అమలాపురంలో జరిగిన స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. దాంతో అధికారులు స్పందించి పైప్‌లైన్‌లను మంగళవారం పరిశీలించారు. వాకలగురులో రహదారిని వెడల్పు చేయడంతో పైపులైన్‌లు పాడైందని దాని స్థానంలో పైపులు ఏర్పాటు చేస్తామన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తామన్నారు. సర్పంచ్ వాకపల్లి దొరబాబు, ఎంపీటీసీ దొరబాబు, జేఈ బి.చలమయ్యలు ఆయన వెంట ఉన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తి మృతి

కొత్తపేట: స్థానిక బాబులుగారి కాలనీలో ఒక వ్యక్తి ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్టు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వాడపాలేనికి చెందిన సలాది ధనరాజు (32) సోమవారం స్థానిక పంచాయతీ పరిధిలోని బాబులుగారి కాలనీలో పొగాకు కొట్టు వద్ద అప్పీ ట్రక్ ఆటోలో పొగాకు కట్టలు లోడ్ చేసి, పైన బరకం కప్పుతుండగా ప్రమాదవశాత్తూ ఆ పైనుంచి వెళ్లిన విద్యుత్ లైన్ వైర్లు తగిలి షాక్‌తో కిందపడిపోయి గాయపడ్డాడు. వెంటనే అతడికి కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స జరిపి ఉన్నత వైద్యం నిమిత్తం రావులపాలెంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నెత్తిన నిప్పుల కుంపటి

- సూరీడి ప్రతాపానికి అల్లాడుతున్న జనం
- అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు



ఎండ తీవ్రతకు షాపులు మూసేయడంతో కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్న ఉప్పలగుప్తం-అమలాపురం మెయిన్‌రోడ్డు

ఉప్పలగుప్తం: రోహిణి కార్తెలకు రోళ్లు పగులుతాయంటారు.. కాని రోహిణి కార్తె రాక ముందే రోడ్డుపై తారు సైతం కరిగిపోయేలా సూరీడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మే మొదటివారంలో అకాల వర్షాలతో వాతావరణ చల్లబడడంతో ప్రజలు హమ్మయ్య అనుకున్నారు. కాని వారం రోజులుగా భానుడు నెత్తిన నిప్పుల కుంపటి కురిపిస్తున్నాడు. సోమ, మంగళ వారాల్లో అమలాపురంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏకంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందంటే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు వహించాలని వైద్యులు సూచిస్తున్నారు.

అప్రకటిత కర్ఫ్యూ

అమలాపురం, ముమ్మిడివరం, ఉప్పలగుప్తం, తాళ్లరేవు, అల్లవరం, ఐ.పోలవరం, కాట్రేనికోన.. ఊరు ఏదైతేనేం.. ఎక్కడ చూసినా ఉదయం 9 దాటిందంటే చాలు జనం బయటకు రావడానికే హడలిపోతున్నారు. వడగాల్పుల తీవ్రతకు ఎక్కడికక్కడ రహదారులపై జనసంచారం నిలిచిపోవడం, వర్తకులు దుకాణాలు మూసేస్తుండడంతో కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తుంది. వ్యవసాయ కూలీలు సైతం సూర్యుడు ఉదయించక ముందే పనులు ప్రారంభించి ఎండ పెరిగే సమయానికి ముగించుకుంటున్నారు. వేడికి, ఉక్కబోతకు తట్టుకోలేక ప్రజలు ఏసీలు, కూలర్లకు ఆకర్షితులవుతున్నారు. చల్లటి పానీయాలకు, జ్యూస్‌లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ప్రధాన సెంటర్లు, కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. ఇప్పుడే ఇలా ఉంటే ఈ నెల 25 నుంచి జూన్ 8 వరకూ ఉండనున్న రోహిణి కార్తెల సమయంలో ఉష్ణోగ్రతలు ఇంకెంత పెరుగుతాయోనన్న చర్చ సర్వత్రా సాగుతుంది.



ఎండలో నెత్తిన ముసుగేసుకుని వెళుతున్న వృద్ధుడు

అత్యవసరమైతే తప్ప బయట తిరగకూడదు



ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయట తిరగకూడదు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు ఎండబారిన పడకుండా చూసుకోవాలి. తాగునీరు, మజ్జిగ, గ్లూకోజ్, కొబ్బరి నీళ్లు వంటి పానీయాలను తరచూ తాగుతుండాలి. ఎవరికైనా వడదెబ్బ తగిలితే వెంటనే నీడలోకి తీసుకెళ్లి తడిగుడ్డతో ముఖం తుడిచి దగ్గరలో ఉన్న వైద్యుడి వద్దకు తీసుకెళ్లడం మంచిది.

– ములపర్తి శాంతకుమారి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, పేరూరు, అమలాపురం రూరల్ మండలం

యానాంలో ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీ



ప్లాస్టిక్ నిషేధ ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: పట్టణ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వ్యాపార సంస్థలు నిషేధించాలని కోరుతూ మంగళవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ మంగళవారం నిర్వహించారు. స్థానిక ఆర్ఏఓ కార్యాలయం వద్ద ఆర్ఏఓ మునిస్వామి జెండా ఊపి విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలగడమే కాకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వివిధ వ్యాపార సంస్థల యాజమాన్యాలు ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేసి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్, ఎస్‌ఐ శేరు నూకరాజు, డిప్యూటీ తహసీల్దార్ గణేషన్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణలో భాగస్వాములవ్వాలి



ర్యాలీలో డాక్టర్ భారతలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు



జి.వేమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అమలాపురం టౌన్: డెంగీ నివారణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భారతలక్ష్మి పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గడియారం స్తంభం సెంటర్ వరకూ మంగళవారం ఉదయం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భారతలక్ష్మి మాట్లాడుతూ వృధా నీటి నిల్వలను నిర్మూలిస్తేనే దోమల నివారణ సాధ్యమై డెంగీ నుంచి బయటపడొచ్చన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడులు మాట్లాడుతూ దోమల నివారణకు మున్సిపాలిటీ చేస్తున్న ప్రయత్నాలతో పాటు పట్టణ ప్రజలు ఎవరికివారు తమ ఇళ్ల వద్ద వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సూర్య నగేష్, డాక్టర్ అమృత, పట్టణ శానిటరీ విభాగం ఇన్‌చార్జి ఎస్.వెంకటేశ్వరరావు, వార్డు సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలంలోని కేశనకుర్రు, జి.వేమవరం గ్రామాల్లో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ, అవగాహన సదస్సులు మంగళవారం నిర్వహించారు. ర్యాలీలో చేయి చేయి కలుపుదాం.. డెంగీని నివారిద్దాం...అంటూ నినదించారు. వైద్యులు కె.ఇందిరాశ్రీ, డి.గాయిత్రిలు పాల్గొని డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నీటి నిల్వలు ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మలికిపురం: మండలంలోని కేశనపల్లి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ప్రారంభం అయినట్లు ప్రిన్సిపాల్ యాళ్ల లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ జనరల్ కోర్సుల్లో ఇంగ్లీషు, తెలుగు మీడియం అందుబాటులో ఉన్నాయన్నారు. 2023లో తమ కళాశాల విద్యార్థులకు 70 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన వివరించారు.

పుణ్యక్షేత్రాల సందర్శనకు ముస్లింల బృందం

మామిడికుదురు: పవిత్ర కర్బలా పుణ్యభూమిలోని ముస్లిం పుణ్యక్షేత్రాల సందర్శనలకు ముస్లింల బృందం మంగళవారం పయనమైంది. ఈ బృందం సభ్యులు ఇరాన్, ఇరాక్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తుంది. నగరం పంజీషాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఈ బృందం సభ్యులతో పాటు స్థానిక ముస్లిం పెద్దలు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం బృందం సభ్యులను సాగనంపారు.

ఘనంగా రావులమ్మ తీర్థం



కె.పెదపూడిలో రావులమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన రాజేశ్వరి రావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారిని దర్శించుకుని చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అమ్మవారి ఉయ్యాల సేవలో గ్రామ ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి జాతర సందర్భంగా గ్రామ ఆడపడుచులకు పసుపు, కుంకుమలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సోమవారం రాత్రి అమ్మవారి పూజఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తూ జాతర నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. రావులమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేట దేవాంగ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ సమీపాన ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా ప్రతి రోజు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మూడు రోజుల క్రితం ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని దేవాంగ సంఘం ప్రతినిధులు తెలిపారు. దాతలు కటకం సత్యనారాయణ, పిచ్చుక చరణ్, పిచ్చుక వరుణ్‌ల సహకారంతో ఇంత వరకు చలివేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీ చేశామన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే సంక్షేమం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్
- సన్నవిల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



సన్నవిల్లిలో సంక్షేమ వివరాలను లబ్ధిదారుడికి అందిస్తున్న శ్రీకాంత్ తదితరులు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే పేదలందరికీ సంక్షేమం అందుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని సన్నవిల్లి గ్రామంలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తనయుడు శ్రీకాంత్‌తో కలిసి నిర్వహించారు. వారిద్దరూ ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా సంక్షేమ పథకాల అమలుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి నిరంతర కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి పినిపే జయరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు గనిశెట్టి సద్గురరావు, తొత్తరమూడి బాబులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజ జీయర్ స్వామి తిరు నక్షత్రం

అమలాపురం టౌన్: భీమవరం భాష్యకార సిద్ధాంత పీఠాధిపతులు త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి తిరు నక్షత్ర(పుట్టిన రోజు) వేడుకలు మంగళవారం స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజ దాసుల ఆధ్వర్యంలో తదియారాధన(అన్న సమారాధన) నిర్వహించారు. తదియారాధన కార్యక్రమాన్ని జిల్లా రవాణా శాఖాధికారి డి.అశోక్ ప్రతాపరావు, అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడులు ప్రారంభించి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో రామానుజ దాసులు వంకాయల కాశి, వరదా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



తదియారాధనలో వడ్డిస్తున్న అశోక్‌ప్రతాపరావు, మున్సిపల్ కమిషనర్ నాయుడు తదితరులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పి.మల్లవరం హైస్కూల్‌లో కలుసుకున్న 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

తాళ్లరేవు: 1997–98లో పి.మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా మంగళవారం తమ పాఠశాల వేదికగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 25 ఏళ్ల తరువాత ఒకే చోటకు చేరి ఒకరినొకరు పలకరించుకుని చిన్ననాటి సంగతులన్నీ గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. ఈ సందర్భంగా స్నేహితులంతా ఒక్కసారిగా బాల్యంలోకి వెళ్లిపోయి ఆటపాటలతో సందడి చేశారు. తమ విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు బండి సత్యనారాయణ, డి.అబ్బాయి మాస్టారు, సారథి, వెంకటేశ్వరి, చంద్రలీలలను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. అప్పట్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడం, ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మాస్టారే తమకు ఐదు సబ్జెక్టులు బోధించేవారని పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు అందజేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



అభివృద్ధి పనులపై ఈఈ సుందరేషన్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్

- ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: ఎమ్మెల్యే ల్యాడ్, పీడబ్ల్యూడీ తదితర నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఆర్ఏఓ మునిస్వామి సమక్షంలో పీడబ్ల్యూడీ ఈఈ సుందరేషన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు మంజూరైనా కనకాలపేట పరిధిలోని గాయత్రినగర్‌లో రహదారి పనులు ప్రారంభించలేదన్నారు. తోటవారివీధిలో నూతన డ్రెయినేజీ పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్, టెండర్ ప్రక్రియ పూర్తయినా పనులు మొదలు పెట్టలేదన్నారు. గోపాల్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో చెత్తను సేంద్రియ ఎరువులుగా మార్చే కేంద్రం నిర్మాణ పనులు సైతం చేపట్టాలన్నారు. వర్షాకాలం రాకముందే డ్రెయిన్లు, రహదారుల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. గత సీఆర్‌జెడ్ నిబంధనల వల్ల గోదావరిని ఆనుకుని ఉన్న ఫెర్రీ రోడ్డు ప్రాంత పరిధిలో రహదారులు వేయడానికి అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారన్నారు. కాని ఇటీవల కొత్తగా జరిగిన కోస్టల్ రెగ్యులేటరీ జోన్ అథారిటీ సమావేశంలో 50 మీటర్ల లోపు నిర్మాణాలు చేసుకోవచ్చునని తెలిపారన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ స్కూల్ ఫ్లెక్సీలు

- ఉత్తమ ఫలితాలపై ప్రభుత్వ పాఠశాల ప్రచారం



పెదపట్నంలంకలో ఏర్పాటు చేసిన జెడ్పీ ఉన్నత పాఠశాల ఫ్లెక్సీ

మామిడికుదురు: 'ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో అత్యుత్తమ బోధన' ఈ తరహా ప్రచారం కేవలం ప్రైవేటు స్కూళ్ల నుంచి మాత్రమే జరుగుతుంది. కానీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ స్కూళ్లు కూడా ప్రచారంపై ప్రధానంగా దృష్టి సారించాయి. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 'ఉత్తమ ఫలితాలు సాధించామని', 'అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని', 'పిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించండి' అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు విద్యార్థులను, స్టూడెంట్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పెదపట్నంలంక జెడ్పీ ఉన్నత పాఠశాల పేరిట ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ఫ్లెక్సీలు ప్రింటింగ్ చేయించి గ్రామంలో పలు చోట్ల వాటిని ప్రదర్శించడం విశేషం. 2022–23లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేటు స్కూల్స్‌కు దీటుగా మన పెదపట్నంలంక ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విజయదుందుభి అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 64 శాతం ఉత్తీర్ణత సాధించామని, 73 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో ముగ్గురు విద్యార్థులకు 500 పైబడి మార్కులు వచ్చాయని, ప్రథమశ్రేణిలో 36 మంది, ద్వితీయ శ్రేణిలో 8 మంది ఉత్తీర్ణులయ్యారంటూ ఫ్లెక్సీల్లో ప్రముఖంగా పేర్కొన్నారు. 500 పైబడి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులు కొమ్ముల మౌనికవెంకటసత్యశ్రీ, జవ్వాది తనూజ, కాజులూరి మోహనసీతారామదేవి ఫొటోలను ప్రముఖంగా ముద్రించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు అటు విద్యార్థులను, ఇటు పేరెంట్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోకా వెంకన్నబాబు, పీఎంసీ కమిటీ చైర్మన్ గిడుగు బాబ్జి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు



మాచవరం పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీవో బొజ్జరాజు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలకుండా డివిజన్ పరిధిలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డీఎల్పీవో పి.బొజ్జరాజు అన్నారు. మాచవరం పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 85 శాతం ఇంటి పన్నులు వసూలు చేశామన్నారు. మిగిలిన 15 శాతం ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టు వివాదాల్లో ఉన్నాయన్నారు. గ్రామాల్లో నిర్మించిన సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేసే విధంగా కృషి చేస్తామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి వాటి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈఓపీఆర్డీ బి.మమత, పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్ ఆయన వెంట ఉన్నారు. అంతకుముందు పంచాయతీకి సంబంధించిన సమస్యలపై నాగాబత్తుల శాంతకుమారితో చర్చించారు.